# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 123 వ భాగం

## పురంజనోపాఖ్యానం 16

పురంజనుడి కథ చెప్తున్నాడు కదా, నారదుడు ప్రాచీనబర్హికి, అందులో భాగంగా ఎలా వంద సంవత్సరాలు బతికాడో, మొదట్లో నమ్మిన మహిషి ని ఎలా మోసం చేసాడో ఇప్పుడు తెలుస్తుంది. ఈ కింది పద్యాలలో అర్థం కొంచెం నిఘూఢంగా ఉంది. మెల్లిగా చదవితే గానీ గ్రహింపుకి రాదు.

వ. ఇవ్విధంబున నతండు మహిషీ విప్రలబ్ధుండును వంచిత స్వభావుండును నై పారవశ్యంబునంజేసి యజ్ఞుండును నితరేచ్ఛా విరహితుండును నై క్రీడామృగంబు చాడ్పున వర్తించుచు నా పురంబునఁ గాపురంబుండఁ గొన్ని దినంబుల కా పురంజనుం డొకానొక దినంబున ధనుర్ధరుండై. [4-770]

సీ. పంచాశ్వ యుక్తంబు పంచ బంధనముఁ జ
క్రద్వితయమును యుగద్వయంబు
నాశు వేగంబు నేకాక్షంబు కూబర
ద్వయముఁ బతాకాత్రితయ యుతంబు
నేక రశ్మి యుతంబు నేకసారథికంబు
సప్తవరూథంబు స్వర్ణ భూష
మును బంచ విక్రమమును నేక నీడంబుఁ
బ్రకట పంచప్రహరణము నయిన [4-771]

తే. రథము కాంచన రచిత వర్మము ధరించి
విలస దక్షయ తూణీర కలితుఁ డగుచుఁ
గడఁక దీపింప నెక్కి యేకాదశప్ర
సంఖ్య సేనాసమేతుఁడై సరభసముగ. [4-771.1]

ఇలా కొన్నాళ్ళు గడిపాక అజ్ఞానంతో పెంపుడు జంతువు లాగా (క్రీడా మృగంబు చాడ్పున) ప్రవర్తించే ఈయన పురంలోంచి బయటకొచ్చాడు ధనస్సు ధరించి. అజ్ఞానం ఎలా కలిగింది అంటే, రాణి చేత మోసం చేయబడి (మహిషీ విప్రలబ్ధుండు), పారవశ్యం చేత. ఈ పారవశ్యం ఎందుకనేది ముందు ముందు తెలుస్తుంది. మరోసారి చెప్పుకుందాం ఇందులో మహిషీ విప్రలబ్ధుండు గురించి. ముందు చెప్పినట్టూ ఈ కథ ప్రాచీనబర్హి తో చెప్తున్నాడు కనక ఇది రాజుకి, రాజు రాణీ వల్ల మోసగించబడ్డాడు అని చెప్తున్నాడు. కానీ ఇదే కథ రాజూ రాణి లని తిరగరాసి రాణి ఇలా రాజుచేత మోసగించబడింది అని తెలుస్తుంది మనకి చివర్లో. అందుచేత లింగ వివక్ష, ఇదీ అదీ అంటూ భాగవతం చదవవద్దు.

దేనితో వెళ్ళాడు వేటకి? ఐదు గుర్రాలు (పంచాశ్వ యుక్తంబు) ఐదు కట్లు లేదా బంధనాలు, రెండు చక్రాలు, రెండు యుగాలు, వాయువేగం (ఆశువేగము), మూడు ధ్వజాలు, అక్షయమైన అమ్ములపొది, పదకొండు సేనలతో (ఏకాదశ ప్రసంఖ్య సేనాసమేతుడై). వెళ్ళేది కూడా అతివేగంగా (సరభసముగ) వెళ్ళాడు.

వ. పురంబు వెడలి పంచప్రస్థంబను వనంబునకుం జని యందు విడువరాని మహిషిని విడిచి మృగయాసక్తుండై దృప్తుండగుచు ధనుర్బాణంబులు ధరియించి సంచరించుచు నాసుర వర్తనంబునం దగిలి ఘోరాత్ముండు నదయుండునై నిశాతసాయకంబుల చేత నమ్మృగ వ్రాతంబులం బరిమార్చె; రాజులకు మృగయా వినోదంబు విహితానుష్ఠానం బగుచుండ నాసురవృత్తి యెట్లయ్యె; నని యంటివేని; నిది రాగ ప్రాప్తం బగుటను విహితంబుగాదు; వినుము; శ్రాద్ధాదులందే ప్రఖ్యాత శ్రాద్ధదివసంబుల యందే రాజైన వాఁడే, మేధ్యంబులయిన పశువులనే వనంబునందే యథోపయుక్తంబుగానే వధియింపంజను నను నియమ మాత్రంబు గలదు; గావున జ్ఞాని యైన విద్వాంసుం డాచరింపడు; గాక యాచరించినం గర్మానుష్ఠానజనితంబయిన జ్ఞానంబునం జేసి యందుఁ బొరయం; డట్లుగాక నియమోల్లంఘనంబునం గర్మాచరణుం డగువాఁ డభిమానంబు నొంది కర్మబద్ధుండై గుణప్రవాహ పతితుండును నష్టప్రజ్ఞుండునునై యధోగతిం గూలు; నిట్లగుటం జేసి సాధుజనులకు సర్వప్రకారంబుల నాసురవృత్తి మానం దగు" నని వెండియు నిట్లనియె "నంతం బురంజనుం డవ్వనంబున. [4-772]

ఇలా వెళ్ళిన పురంజనుడు ఇష్టం వచ్చినట్టూ రాక్షసుడిలా దయలేనివాడుగా ఉంటూ అనేక మృగాలని చంపాడు. ధర్మ సందేహం ఏమంటే, రాజు ఇష్టం వచ్చినట్టూ వేటకి వెళ్ళొచ్చు, చంపవచ్చు అంటారు కదా, అది రాక్షస క్రీడ అని ఎలా అంటారు? దానికి సమాధానం చెప్తున్నాడు. రాజు అయినా సరే కొన్ని నియమాలు ఉన్నాయి వేటకి. ముఖ్యమైన శ్రాద్ధ దినాలలో మాత్రమే, రాజు అయినవాడే, మేధ్యమైన (యజ్ఞానికి పనికివచ్చే) పశువులని చంపవచ్చు, అదీ అడవులలోనే, కావలసినన్ని మాత్రమే (యధోపయుక్తంబుగా) చంపవచ్చు. ఇది మర్చిపోయి ఇష్టానుసారం ప్రవర్తిస్తే అధోగతి కలుగుతుంది. అందువల్ల రాక్షస ప్రవృత్తి మానుకోవాలి. మొదట్లో యజ్ఞాలు చేస్తూ పశువులని చంపుతుంటే నారదుడు వచ్చి పురంజనుడి కధ చెప్తున్నాడు కనక మరోసారి ఆ రోజుల్లో ఉన్న ధర్మాన్ని చెప్తున్నాడు. ఇలా పశువులని, జనాలని ఎందుకు హింసించకూడదో, వాటివల్ల వచ్చే నష్టం ఏమి ఏమిటో. జంతువుల్లో కూడా ఈ ధర్మం అంతర్లీనంగా ఉన్నట్టు మనం గమనించవచ్చు. పులి సింహం వంటివి ఇష్టానుసారం మిగతా జంతువులని కనబడగానే చంపి పారేయవు. ఆకలేసినపుడు మాత్రమే, అదీ మిగతా పశువుల లాగా బాగ పరుగెత్తలేనివీ, నీరసించినవీ, వీటినే చంపి తింటాయి. అలా క్రూర మృగాల, పశువుల సంఖ్య పెరిగిపోకుండా జరగడం కూడా ఈ మధ్య నిరూపించారు అనేకమంది. ఈ ధర్మం తెలిసి కూడా పాటించనిది దురదృష్టవశాత్తూ, మనిషి అనే మృగం ఒకటే.

పురానికి తిరిగి వచ్చిన పురంజనుడికి తన మహిషి కనిపించలేదు. ఆవిడకి పది మంది భృత్యులూ తలో వందమంది హితులూ ఉన్నారు కనక వాళ్లని అడిగాడు. వాళ్ళు చెప్తున్నారు.

క. అనవుడు విని యక్కాంతలు
జనపతి కిట్లనిరి “రాజసత్తమ! యిదిగోఁ
దన కొంగైనను బఱపుగ
నొనరింపక నేలఁ బొరలుచున్నది వగలన్” [4-783]

ఇదిగో ఇక్కడే నేలమీద, కొంగుకూడా పరుచుకోకుండా పడుకుని ఉంది – అలక తో, ఏడుస్తూ ఉంది (వగలన్) వచ్చి చూసుకో.

ఆ. జలజనేత్ర ప్రణయ సంజాత రోష భా
వమున నయిన యట్టి వక్రదృష్టి
జన విభుండు చూచి యనునయ కోవిదుఁ
డగుచు నప్పయోరుహాక్షిఁ జేరి. [4-786]

ఇలా చూసిన రాజు, ఏడిచే మహిషి దగ్గిరకి చేరాడు ఓదార్చడం (అనునయ కోవిదుడగుచు) కోసం.

మ. సరసోదార సుధా రసోపమ వచశ్చాతుర్య సౌభాగ్యమై
హరినీలోపమ కోమలాలక యుతంబై విభ్రమభ్రూలతా
పరిజుష్టస్మిత సద్విలోకనమునై భాసిల్లు యుష్మన్ముఖాం
బురుహంబున్ భవదీయ దాసునకుఁ బూఁబోఁడీ! కృపం జూపవే. [4-791]

పూలవంటి సుకుమారం కలదానివి కదా (పూబోడి), అమృతం వంటి (సరసోధార) నీ వాక్ చాతుర్యం, ఇంద్రనీలం (హరినీల) లాంటి రంగు; కోమలమైన ముంగురులు, విలాసాలు విరజిమ్మే కనుబొమలు (భ్రూ – కనుబొమలు) ఉండి భాసిల్లే (ప్రకాసించే) నీ మోము (ముఖాంబోరుహము – అంబోరుహము అంటే పద్మం) ఈ దాసుడికి ఒకసారి చూపించు. ఇంతటి రాక్షస ప్రవృత్తి వేటలో చూపించాక ఇంట్లో మహిషి అలిగింది. ఆవిడని ప్రసన్నం చేసుకోవడానికి బతిమాలుకుంటున్నాడు. అలా ఆవిడని తనదారిలోకి తెచ్చుకున్నాడు బతిమాలి.

పద్యం మరోసారి చదివితే 'ఏమిటిది పోతన రాసినదేనా?' అనిపించక మానదు. ఎందుకంటే అత్యంత సులభంగా అర్ధమయ్యే ద్రాక్షాపాకం రాయగలిగిన పోతన ఇటువంటి నారికేళా పాకం కూడా రాయగలడు. మరో విషయం గమనించారా? కథలో పడి కొట్టుకుపోకుండా, భాగవతం అంటే శ్రీహరి సుమా, భగంతుణ్ణి మర్చిపోకండి అంటూ శుకమహర్షి పరిక్షిత్తుతో చెప్తున్నట్టూ 'హరి హరి హరి' అంటూ పదాలు పెట్టగలడు మన పోతన. అందుకే ఇంద్రనీలాలని చెప్పేటప్పుడు "హరినీల" అన్నాడు రెండో పాదంలో.

వ. మఱియు నతం డున్నద్ధ మదుండును మహామనుండును నర్హశయ్యా శయనుండును మహిషీ భుజోపధానుండును నై యజ్ఞానాభిభూతుం డగుటంజేసి స్వరూప భూత పరమ పురుషార్థంబు నెఱుంగక నిజ మహిషియె పరమ పురుషార్థంబుగాఁ దలంచుచు రమించుచుం గామ కశ్మలచిత్తుం డైన యతనికి నవయౌవనంబైన కాలంబు క్షణార్థంబునుం బోలె గతం బయ్యె; అంత. [4-800]

అలా ఆవిడని బతిమాలుకోవడం, మరో సారి వేట, మళ్ళీ బతిమాలుకోవడం ఇలా జీవితం గడిచిపోతోంది. పురుషార్థం అంటే తెలుసుకోకుండా నిజంగా ఈవిడే నా పురుషార్థం అనుకుంటూ మలినమైన మనసుతో (కశ్మల చిత్తుండై) యౌవనం అంతా గడిపేసాడు. ఇదంతా అర క్షణంలో జరిగినట్టూ అయింది.

ఓ చిన్న కథ చెప్పుకుందాం ఇక్కడ. బుద్ధుడు పుట్టినప్పుడు అసితుడు అనే ఆయన పిల్లవాణ్ణి చూడ్డానికి వచ్చేడుట. అప్పటికి కొన్ని రోజుల ముందే బుద్ధుడి తల్లి మరణించింది. పుట్టిన పిల్లవాడి కాళ్ళు తలకి ఆనించుకుని కన్నీళ్ళు పెట్టుకున్నాట్ట ఈ అసితుడు. శుద్ధోధన మహారాజు అడిగాడు, అయ్యా ఎందుకలా కన్నీళ్ళు పెట్టుకుంటున్నారు, పిల్లవాడికేం కష్టం కలుగదు కదా అని.  అప్పుడు అసితుడు చెప్తాడు. అబ్బే అదేమీ లేదు. ఈ పిల్లవాడు పెరిగి పెద్దై విశ్వవిజేత కాబోతున్నాడు కానీ అప్పటిదాకా నేను ఈయన చెప్పేవి వినడానికి ఉండను కదా అని నాకు బాధ కలిగింది. అయితే నా మేనల్లుడికి ఈయన ప్రసంగాలు వినే అదృష్టం ఉండొచ్చు అని చెప్పి మేనల్లుడి దగ్గిరకి వెళ్ళాడు. అక్కడ ఆ మేనల్లుడికి సన్యాసం ఇచ్చి ఇప్పుడే తపస్సు మొదలుపెట్టు, సిద్ధార్థుడు పెరిగి బుద్ధుడు అయ్యేసరికి నీ మనసు పరిపక్వానికి వస్తుంది ఆయన బోధనలు వినడానికి అంటూ చెప్తాడు. అయితే మేనల్లుడు ఎదురు అడుగుతాడు – ఎప్పుడో ఇరవై ఏళ్ల తర్వాత కదా ఇదంతా జరిగేది, ఇప్పటినుంచే సన్యాసం ఎందుకూ అని. అప్పుడు అసితుడు చెప్తాడు అసలు విషయం – కాలం కన్ను మూసి తెరిచినట్టూ గడిచిపోతుంది. అదీగాక ఈ యవ్వనంలో ఉన్న వయసు నుంచీ నువ్వు మనసు అదుపులో పెట్టుకోలేకపోతే ముందు మాత్రం ఎలా పెట్టుకోగలవు? ఇదే పైన వచనంలో చెప్పిన యవ్వనం అరక్షణంలో జరిగిపోవడం అనేది.  మనలో చాలామందికి కూడా ఇది బాగా తెల్సిన విషయమే. మొన్న మొన్న జరిగినట్టున్న విషయం నిజంగా జరిగి ఇరవై ముప్పై ఏళ్ళు అయి ఉండొచ్చు. అదేమిటి ఇన్నేళ్ళు అంత త్వరగా గడిచిపోయాయా అప్పుడే అన్పించడం సహజం కదా? అయితే కాలం మాత్రం అతి మెల్లగా ఒక్కో క్షణం లెక్క కట్టుకుంటూ అనంతంగా సాగుతూనే ఉంటుంది. దీన్నే భగవద్గీతలో కృష్ణుడంటాడు – అహమేవాక్షయః కాలో (అనంతంగా సాగిపోయే కాలాన్ని నేనే - 10.33).

క. విశద యశోజలనిధి యా
శశిముఖి యగు భార్య వలన సమ్మతి నేకా
దశశత పుత్రుల రణక
ర్కశ దేహులఁ గాంచి కౌతుకంబున మఱియున్. [4-801]

ఇలా పురంలో గడుపుతున్న జీవితంలో మన రాజుగారు మహిషి వల్ల పదుకొండువేల మంది (ఏకాదశ శత) పుత్రులని కన్నాడు. వీరందరూ కూడా యుద్ధవీరులు (రణ కర్కశ దేహులు).

క. గురు శీలౌదార్య గుణో
త్తరలను సల్లలిత గుణ కదంబలఁ బ్రియలన్
వరకుల పావనల దశో
త్తరశత దుహితలను గాంచెఁ దత్పతివలనన్. [4-802]

కొడుకులేనా? కూతుర్లు పుట్టలేదా అంటారని అది కూడా చెప్తున్నాడు (మొదట్లో చెప్పుకున్నాం దీని గురించి, ఈ పురంజనోపాఖ్యానం అనేది ఆడా మగా అనే లింగ వివక్ష లేనిది అని). ఈ కుమార్తెలు నూట పది మంది (దశోత్తర శత; శత – నూరు, ఉత్తర – పైన, దశ – పది; లేదా వందకి పైన/ఉత్తరంగా పది – నూటపది) మంచి గుణాలు కలవారు, వరకుల పావనులు.

ఆ. అనఘ! యట్టి రిక్థహారులు గేహకో
శాను జీవ యుతులు నయిన యట్టి
నందనాదులందుఁ జెందిన మమత ని
బద్ధుఁడయ్యె నంతఁ బార్థివుండు. [4-808]

ఇలా పుట్టిన అందరికీ పెళ్ళిళ్ళూ, పెద్దరికాలూ అంటూ తనకి చేతనైనంత చేశాడు. వీరంతా ఈ పురంజనుడి డబ్బుమీద బతుకుతున్నారు (ఆర్థిక హారులు). అయినా సరే ఈయన వాళ్లమీద మమకారం పెంచుకుని వీళ్ళందరూ బంధువులు, బాంధవ్యాలూ అనుకుంటూ ఉన్నాడు రాజు (పార్థివుడు, పృథివి – భూమిని పాలించేవాడు)

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS